క్లుప్తంగా

దత్తక్షేత్రంలో పూజలు



గణపతి సచ్చిదానంద స్వామి చిత్రపటం వద్ద పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామి (అప్పాజీ) 83వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్వామీజీకి పాదుకా పూజ, గురుగీత పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం, ఆయుష్ హోమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు

రణస్థలం: రణస్థలం గ్రామానికి చెందిన కెల్ల వెంకటేష్ కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను కలిసి భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: పైడిభీమవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర రావు పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలను మండల రెవెన్యూ, పరిషత్ అధికారులకు పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, సర్పంచ్ సింక భవాని, పంచాయతీ కార్యదర్శి పి.అజయ్‌బాబు, గ్రామపెద్దలు రౌతు శ్రీనివాసరావు, వద్దాది శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న అభిమానులు

శ్రీకాకుళం: ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను అన్నారు. శ్రీకాకుళంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో పి.వి.సునీల్ కుమార్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ, ఏఐఎం సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఆంధ్రా కవాలీ ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో నూకాలమ్మతల్లి, పెద్దమ్మతల్లి అమ్మవార్ల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సంతోషమాత గుడి వద్ద ఆంధ్రా కవాలీ, నూకాలమ్మ దేవర వద్ద ఉదయ్‌కుమార్ టీమ్ డ్యాన్సుబేబీ డ్యాన్సు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు డి.పి.దేవ్, ఎల్.రామలింగ స్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాక పీబీ నగర్‌కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ 35వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు భోగాపురపు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు.

రేషన్ ఇవ్వలేదు



నావయస్సు 76 ఏళ్లు. ఇంటి నుంచి బయటకు రాలేను. ఇదివరకూ రేషన్ బండి మా ఇంటి వద్దకు వచ్చి ఆగేది. ఇప్పుడు ఇంతవరకు రేషన్ బియ్యం అందజేయలేదు. ఇదేంటని డీలర్‌ను ప్రశ్నిస్తే ఇంకా నియమ నిబంధనలు రాలేదని చెబుతున్నారు.

– మట్ట సూరమ్మ, గూడేం, శ్రీకాకుళం రూరల్ మండలం

పథకాలేవీ?



గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా అనుకున్న సమయానికి వచ్చింది. ఈ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కింద రూ.20 ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ దిశగా ఎటువంటి డబ్బులు జమ కాలేదు. ఖరీఫ్ వస్తున్నా రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు.

– ఇనుముల జనార్దనరావు, నైరా గ్రామం

మళ్లీ పాత పద్ధతే..



వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు సమయానికి అందేవి. పింఛన్ నగదు, రేషన్‌కార్డు మంజూరు, బియ్యం పంపిణీ ఇలా అన్ని ఇంటికి అందివ్వడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉండేవారు. కూటమి ప్రభుత్వం సేవలు నిలిపేయడంతో మండల కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు చూట్టూ తిరగాల్సి వస్తోంది.

– వమరవల్లి భారతి, తోనంగి, గార మండలం

పాలనకు చంద్ర గ్రహణం

- ఇంటింటి సేవలకు టాటా..
- జనాలంతా కార్యాలయాల బాట
- పథకాలు అందక, పనులు జరగక పాట్లు





రణస్థలంలో ఆధార్ సెంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న జనం (ఫైల్)

రణస్థలం/ఎచ్చెర్ల/గార/శ్రీకాకుళం రూరల్: గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి పథకం, ప్రభుత్వ సేవలు నేరుగా ఇంటికే అందేవి. వలంటీర్ వ్యవస్థ, సచివాలయాల ద్వారా లబ్ధిదారులు నిశ్చింతగా సంక్షేమ ఫలాలు పొందేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామ స్వరాజ్య పాలనకు తూట్లుపడ్డాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు కోత పెట్టిన కూటమి ప్రభుత్వం మిగిలిన పౌర సేవలకు సైతం ముప్పుతిప్పలు పెడుతోంది. ఇటీవలే రేషన్ వాహనాలు సైతం రద్దు చేసి మళ్లీ డిపోల వద్ద జనాలను పడిగాపులు కాసేలా అవస్థలకు గురిచేస్తోంది. కొత్త రేషన్ కార్డులకు చంటిబిడ్డలతో దంపతులిద్దరూ సబ్ రిజిస్ట్రార్, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ పనులు మానుకుని ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి పట్టింది. ఆధార్ కార్డు కావాలన్నా, ఐదేళ్లు దాటిన పిల్లలకు వేలిముద్రలు, ఫొటోలు మార్పులు చేయాలన్న కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గతమంతా ఘనం..

గత ప్రభుత్వంలో ఎటువంటి సేవలైనా వృద్ధులు, దివ్యాంగులు, రైతులు, మహిళలు గడపదాటాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే వచ్చేవి. ప్రభుత్వ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా ఇంటివద్దకు అందేవి. ఇప్పుడు వీరు లేకపోవడంతో సచివాలయాలు, మండల కేంద్రాలు, అధికారులు చుట్టూ పనుల కోసం తిరిగాల్సి వస్తోంది. రైతులకు ఎరువులు, విత్తనాలు గ్రామంలోని రైతు భరోషా కేంద్రాలద్వారా ఊరుదాటకుండానే పనులు జరిగేవి. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో విసుగుచెందిన రైతులు ప్రైవేటు దుకాణాల వద్ద ఎరువులు, పురుగులుమందులు, విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నారు.

వలంటీర్ వ్యవస్థ రద్దుతో..

ప్రభుత్వ సేవలు సులభతరమవ్వాలన్న మంచి సంకల్పంతో గత ప్రభుత్వం తీసుకువచ్చిన వలంటీరు వ్యవస్థ సేవలు సత్ఫలితానిచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసి ప్రజలకు ఏమి కావాలన్నా పారదర్శకంగా, అత్యంత వేగంగా సేవలందేవి. ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుతుందన్న సమయంలోనే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ ఠంచన్‌గా అందించేవారు. రేషన్ కార్డు కావాలన్నా, ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాల అవసరమైన అన్ని పత్రాలను ఇంటివద్దకు వలంటీర్లు వచ్చి ఆన్‌లైన్ చేసేవారు. రేషన్ బియ్యం ఇంటివద్దనే అందజేసి ప్రజల కష్టాలను తగ్గించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వలంటీరు వ్యవస్థను రద్దు చేసి ప్రజలకు కష్టాలను తెచ్చిపెట్టింది.

తొలగించడం అన్యాయం



రేషన్ వాహనాల ద్వారా బియ్యం ఇంటి వద్దకే తెచ్చి అందించేవారు. ఇప్పుడు రేషన్ షాపులు వద్ద క్యూలో నిలబడి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రేషన్ వాహనాల ఆపరేటర్లు, వలంటీర్లను తొలగించి వారి ఉసురుపోసుకున్నారు.

– బవిరి రమణ, జె.ఆర్.పురం సర్పంచ్

తిప్పలు తప్పడం లేదు



కొత్త రేషన్ కార్డు కావలన్నా, ఆధార్ నమోదు, మార్పులు చేయాలన్నా, వివాహ రిజిస్ట్రేషన్ చేయాలన్నా మండల కేంద్రాల చూట్టు రెండు మూడు రోజులు తిరగాల్సిందే. గతంలో అంతా గ్రామ సచివాలయంలోనే జరిగిపోయేవి.

– మైలపల్లి పట్టయ్య, కొవ్వాడ, రణస్థలం మండలం

క్యూలో ఉండాల్సిందే..



గతంలో ఇంటివద్దకు వ్యాన్ ద్వారా రేషన్ సరుకులు తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ డిపోలకు వెళ్లి రేషన్ తెచ్చుకోమంటున్నారు. సర్వర్, ఇతర సమస్యల వల్ల అక్కడ గంటలకొద్దీ లైన్‌లో నిలబడి రేషన్ తీసుకోవాల్సి వస్తోంది.

– ఆరంగి అప్పలసూరి, ఆరంగిపేట, లావేరు మండలం

గతంలోనే మేలు..



ఇంటికి పెద్దదిక్కులా ఉండి అన్ని పనులను చూసుకునే వలంటీర్ల తొలగించడంతో ఇప్పుడు ఇబ్బందులు పడాల్సి వసోతంది. ఏ పని కావాలన్నా వలంటీర్‌ను సంప్రదించి జిరాక్స్‌లు ఇచ్చేస్తే అన్నీ వలంటీరే చూసుకునేవారు. ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– గొర్లె సురేష్‌కుమార్, మురపాక, లావేరు మండలం

ఇబ్బందుల్లో రైతాంగం



గతంలో ఆర్‌బీకేల ద్వారా రైతులన్ని సేవలను అందించేవారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందేవి. ఇప్పుడు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి వచ్చింది. చాలా మంది రైతులు విసుగుచెంది ప్రైవేటు దుకాణాల వద్ద ఎరువులు, పురుగు మందులు కొనుక్కుంటున్నారు.

– ఎస్ శ్రీనివాసరావు, కొంగరాం, ఎచ్చెర్ల మండలం

కల్యాణం..కమనీయం..



బలగలో ఉత్తరేశ్వరుని కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో బలరామ ప్రతిష్ట ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ నేతృత్వంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి గన్నవరపు కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులచే వార్షిక కల్యాణ వేడుకలలో భాగంగా కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలతో సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. అంతకుముందు సర్పవాహనంపై స్వామివారికి తిరువీధి నిర్వహించారు. బలగ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఉత్సవమూర్తులను నగరంలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కొన్నావీధి భీమేశ్వరాలయంలో వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. మొండేటి వీధిలోని లలితా సమేత శివకామేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవంలోభాగంగా కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



కోటేశ్వరాలయంలో సర్పవాహనంపై స్వామివారి ఊరేగింపు



కొన్నావీధి భీమేశ్వరాలయంలో..



మొండేటివీధి శివకామేశ్వరస్వామి ఆలయంలో..



చిన్నబజారులోని దూదివారి వెంకన్న ఆలయంలో కల్యాణ వేడుకలు



బ్యాంకర్స్ కాలనీ శివబాలాజీ ఆలయంలో కల్యాణోత్సవం

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ముకుందను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: బంటుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాశపు ముకుందకు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం విజయనగరం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాసపు శ్రీనివాస్, వెలిచేటి నారాయణరావు, గోవిందాసు సాయిబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వడదెబ్బతో అప్రమత్తం



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సంస్థ సిబ్బంది

ఎచ్చెర్ల : ఉపాధి వేతనదారులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని నైస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ రవితేజ సూచించారు. లావేరు మండలం గుమ్మడాం పంచాయతీ వేణుగోపాలపురంలో నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రితిక, పూజ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు ఆహ్వానం

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలోని మోడల్ స్కూల్లో మిగులు సీట్లు భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి ఈ నెల 20 సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

జి.సిగడాం: ఈ నెల 21న జరిగే యోగా దినోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలని రామకృష్ణ యోగా చైతన్యధార్మిక సంస్థ గురువులు మీసాల రామకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం నాగులవలస, జి.సిగడాం, మద్రివలస, పెంట గ్రామాల్లో అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వజ్జిపర్తి రఘురాం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం



వెంటేశ్వర కాలేజీ వద్ద డీఎస్సీ అభ్యర్థులు

ఎచ్చెర్ల: టీచర్ పోస్టుల భర్తీకోసం ఆన్‌లైన్ విధానంలో మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చిలకపాలేంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరిగాయి.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

జి.సిగడాం: గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కాచి వడబోసిన నీటినే తాగాలని జి.సిగడాం పీహెచ్‌సీ వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు కోరారు. శుక్రవారం స్థానిక ఆరోగ్యకేంద్రంలో వారు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గార గ్రంథాలయంలో బహుమతులతో విద్యార్థులు



లావేరు గ్రంథాలయంలో బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు



కేంద్ర గ్రంథాలయంలో విజేతలతో నిర్వాహకులు

గార: మండల కేంద్రంలో గార శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ నుంచి జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. డ్రాయింగ్, వ్యాసరచన, పేపర్ రీడింగ్, క్విజ్ వంటి ఆటల పోటీలు నిర్వహించగా.. విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ జి.కుమారస్వామి, ఎం.జనార్దన్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి డి.ప్రసాద్, జి.శరత్‌చంద్రలు విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ ఎన్.రామకృష్ణ, చింతల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ మురపాక శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు, బలగ హడ్కో కాలనీ గ్రంథాలయాల్లో ఏప్రిల్ 24 నుంచి జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కర్ రాజా, బలగ శాఖా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను, బాల కథానిలయం అధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందనలు



పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్‌లతో కేంద్రమంత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు హవా కనబర్చారు. మే 30 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు కటక్ వేదికగా జరిగిన 9వ జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీల్లో 26 పతకాలు సాధించారు. వీరికి కోచ్‌లగా గౌతమ్, నవీన్, వంశీ, మేనేజర్‌గా హేమంత్‌ఖాన్, కోచ్ హరి వ్యవహరించి మెప్పించారు. పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు, కోచ్‌లను కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు శుక్రవారం శ్రీకాకుళంలో అభినందించారు. సబ్‌జూనియర్ విభాగంలో షేక్ అబ్దుల్ రెహమాన్, గోవింద జాన్యునానదన్, ముట్టి జెస్సీ, ముట్టి కౌషిక్, ముంజి సాయిచైతన్య, టంకాల షణ్ముఖ్, క్యాడెట్ బాలురు విభాగంలో కుప్పిలి మహేంద్ర సాయి, జామి సాక్షిత్, కిల్లంశెట్టి వినయ్, క్యాడెట్ బాలికల విభాగంలో దనాల జోషిని, ముంజి సాయిజోషిక, తాతపూడి రోషిత, గోవింద దేవర్షిని, క్యాడెట్ పూమ్సే డివిజన్‌లో ధనాల జోషిని, జూనియర్ డివిజన్ విభాగంలో దయా శంకర్‌రెడ్డి పతకాలు సాధించారు. కార్యక్రమంలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో జాగ్రత్త



పోతయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరికృష్ణరావు

రణస్థలం: సముద్ర తీరం వెంబడి ఉగ్రవాదులు, ఇతర దేశాలకు చెందిన వ్యక్తుల వచ్చినప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరావు అన్నారు. రణస్థలం మండలం పాతయ్యపేట, గురయ్యపేట, చీకటిపేట, దోనిపేట గ్రామాల్లో శుక్రవారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. తీరంలో అనుమానాస్పదంగా కనిపిస్తే 1093 గానీ, 93929 14712 నంబర్‌కు గానీ తెలియజేయాలని కోరారు.

యువతికి కల్యాణ కానుక



పెళ్లి కుమార్తెకు బంగారం వస్తువులను అందజేస్తున్న వెంకటరావు

శ్రీకాకుళం రూరల్: కనుగులవానిపేటకు చెందిన సప్తగిరి జ్యూయలర్స్ యజమాని గంగు వెంకటరావు కల్యాణమస్తు పేరిట ఖాజీపేట గ్రామానికి చెందిన కర్రి లక్ష్మీనారాయణ కుటుంబానికి రెండు తులాల బంగారం నెక్లెస్, పావుకేజీ వెండి వస్తువులను శుక్రవారం అందజేశారు. గత ఏడాది డిసెంబర్‌లో శ్రీకాకుళం పరిధిలోని సప్తగిరి జ్యూయలర్స్ షాపులో తీసిన లక్కీడ్రాలో ఖాజీపేట గ్రామానికి చెందిన కర్రి లక్ష్మీనారాయణ కుమార్తె కర్రి ద్రాక్షాయిని ప్రథమ బహుమతిగా ఎంపికయ్యింది. అప్పట్లో ఆ యువతికి కల్యాణ కానుక సర్టిఫికెట్ అందజేశారు. ఇటీవల వివాహంనిశ్చయం కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో ముందుగా ప్రకటించిన విధంగా ఆభరణాలు అందజేశారు.

నేడు బక్రీద్ ప్రార్థనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జి.టి.రోడ్డులో జామియా మసీదు వద్ద శనివారం ఉదయం 8.30గంటలకు బక్రీద్ ప్రార్థనలు జరుగుతాయని కమిటీ మాజీ కార్యదర్శి అక్బర్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు సోదరులంతా జామియా మసీదు వద్ద జరిగే సామూహిక నమాజు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

శ్రీకాకుళం రూరల్ : పాఠశాలలు తెరిచాక విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టాలని, రాగి సంగటి తప్పక అందివ్వాలని ఎంఈఓ ఎస్.కృష్ణ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని వంట నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంఈవో–1 పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు చేయూత

శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బిడ్డిక అప్పలస్వామికి చేయూతగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి రూ. 4.03 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అందించారు. జిల్లా హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని ఈ విధంగా అందజేశారు.